www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
30.10.2026





- కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ
- పరిశ్రమలకు పవర్ హాలిడేల దెబ్బ
- గ్లోబల్ సమ్మిట్ కాదు గోబెల్స్ సమ్మిట్
- పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలో ట్యాంకర్ల ఎత్తిపోతల పాలన

రైతు డిక్లరేషన్ పోయి సెల్ఫ్ డిక్లరేషన్లా?



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 30) : ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకునే దుస్థితికి తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కాంగ్రెస్ తెచ్చిన కరువు వల్ల జనరేటర్లు, ట్యాంకర్లతో పంటలను కాపాడుకోవాల్సి వస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఎత్తిపోతలు పోయి ట్యాంకర్ల ఎత్తిపోతలు నడుస్తున్నాయని ధ్వజమెత్తారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు, క్రాప్, పవర్, పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నింటికీ హాలిడే ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇవ్వాలని పిలుపునిచ్చారు. కరువు పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని, పెండింగ్‌లో

మిగతా 5లో..

ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకునే దుస్థితికి తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రాజెక్టుల ఎత్తిపోతలు పోయి ట్యాంకర్ల ఎత్తిపోతలు నడుస్తున్నాయని మండిపడ్డారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ సర్కారు కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ జపం చేస్తోందని, కరువు, కరెంట్ కోతలు, పవర్ హాలిడేలతో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను సంక్షోభంలోకి నెట్టిన ఈ ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడాలని ఆయన పిలుపునిచ్చారు. కలంజ్యోతి, బ్యూరో



మీ పెట్టుబడులకు బాధ్యత నాది

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

- పెట్టుబడులను రెట్టింపు చేసుకోండి
- పెట్టుబడుల తెలంగాణే మా లక్ష్యం
- తెలంగాణతోనే వికసిత భారత్
- ప్రపంచ నగరాలతోనే హైదరాబాద్ పోటీ
- రైలు విమాన రంగాల్లో ముందడుగు
- మీ ఆలోచనలను పాలసీలుగా మారుస్తాం

తెలంగాణలో పెట్టుబడిదారుల ప్రతి పైసాకు భద్రత కల్పించడం, ఆ పెట్టుబడులు వృద్ధి చెందేలా చూడడం తన వ్యక్తిగత బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తో కలిసి పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. చారిత్రక నేపథ్యం, ఆధునిక సంస్కరణలతో విలసిల్లుతున్న హైదరాబాద్ అంతర్జాతీయ నగరాలతో పోటీపడుతోందని, పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను రెట్టింపు చేసుకుని రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

కలంజ్యోతి, బ్యూరో

5 లో



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శుక్రవారం 30.10.2026
www.kalamjyothi.com



కాంగ్రెస్‌కు పట్టభద్రుల గుణపాఠం తప్పదు

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం
- ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి





కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ఎన్నికల నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య బద్ధంగా తగిన సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలోని శ్రీ సిద్ధేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నర్సంపేట అభివృద్ధి ప్రదాత, ఉద్యమ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, విద్యావంతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు.

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం..

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టకాలంలో ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సమస్య ఎదురైనా వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఓటు కేవలం ఓటు మాత్రమే కాదని, ప్రభుత్వ పనితీరుపై ఇచ్చే బలమైన ప్రజా తీర్పని పేర్కొన్నారు. ప్రతి పట్టభద్రుడిని చైతన్యపరిచి, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు దక్కేలా శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని పిలుపునిచ్చారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టిపెట్టండి..

పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పని చేస్తూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించి, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా గ్రామాల వారీగా కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ పత్తి నాయక్, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్‌యాదవ్, సొసైటీ చైర్మన్లు, మండల కార్యవర్గ సభ్యులు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మండల నాయకులు, ఎమ్మెల్సీ ఎన్నికల గ్రామాల ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



నీటి ఎద్దడి నివారణకు పొదుపు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 29) : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నిర్మల్ పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా వినియోగం, పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి సూచించారు. నీటి వృథాను అరికడుతూ, భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులకు పిలుపునిచ్చారు. నిర్మల్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కౌన్సిలర్లు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటా నీటిని బాధ్యతా యుతంగా వినియోగించేలా ప్రజలను చైతన్య పరచడంతో పాటు, నీటి వృథాను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. కౌన్సిలర్లు ప్రస్తావించిన అంశాలపై స్పందించిన వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రవిబాబు, మేనేజర్ మారుతీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వాలి

బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల

- ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

కలంజ్యోతి, నెక్కొండ (అక్టోబర్ 29) : అర్హులైన పట్టభద్రులందరూ తప్పకుండా తమ ఓటును నమోదు చేసుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నెక్కొండ మండల ఎమ్మెల్సీ కన్వీనర్ అంబాల సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీసే వారికే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఓటు హక్కు లేని పట్టభద్రులు వెంటనే నమోదు చేసుకోవాలని, మీ ఓటే మీ భవిష్యత్తు అని ఆయన స్పష్టం చేశారు.

పూర్తి సహకారం అందిస్తాం..

ఓటరు నమోదు ప్రక్రియలో ఎవరికైనా ఇబ్బందులు లేదా సందేహాలు తలెత్తితే అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. పట్టభద్రులకు అవసరమైన పూర్తి సహకారం అందించి ఓటు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయించేందుకు బీజేపీ శ్రేణులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పేర్కొన్నారు. సందేహాలు ఉన్నవారు నాయిని అశోక్ (9701053729), అంబాల సుధీర్ (9885984120) నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, నెక్కొండ మండల అధ్యక్షురాలు నాయిని అనూష అశోక్, మండల ఇన్‌చార్జి కుడికాల శ్రీధర్, నర్సంపేట మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్, బీజేపీ నాయకులు దామచర్ల రామారావు, రాంపల్లి రాజగోపాల్, అంబాల రాంగోపాల్, పసుల అశోక్, రాపాక సందీప్, లావుడియా శ్రీనివాస్, మైబు నాయక్, లౌడియాలపతి, కాజా పాషా, సూత్రపు శీను, నాగరాజు, కార్తీక్, శ్రీరంగం సంపత్, రాకేష్ రావు, దొనికే అశోక్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి అచ్చ దయాకర్, జిల్లా ఉపాధ్యక్షులు కొంకిస విగ్నేష్ గౌడ్, నెక్కొండ మండల అధ్యక్షులు కుడికాల సుధీర్, నర్సంపేట టౌన్ అధ్యక్షులు గోస్కుల సందీప్, నల్లబెల్లి మండల అధ్యక్షులు తిమ్మాపురం శివ తదితరులు పాల్గొన్నారు.





ఎర్ర మల్లారెడ్డికి కిసాన్ పురస్కారం

ఆదర్శ వ్యవసాయానికి దక్కిన గుర్తింపు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన రైతు ఎర్ర మల్లారెడ్డిని ఉత్తమ ఆదర్శ రైతుగా గుర్తిస్తూ కిసాన్ మహారాజ్-2026 పురస్కారం వరించింది. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో కిసాన్ మహారాజ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎర్ర మల్లారెడ్డిని రూ.5,000 నగదు పురస్కారంతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న నిరంతర కృషి, అనుసరిస్తున్న ఆదర్శవంతమైన సాగు విధానాలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమీనాబాద్ గ్రామానికి చెందిన రైతుకు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ అరుదైన గుర్తింపు దక్కడం పట్ల గ్రామస్తులు, తోటి రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎర్ర మల్లారెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
శుక్రవారం 30.10.2026
www.kalamjyothi.com

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 29) : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులు, రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ పనితీరుపై గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి, వైద్య పరికరాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు..

జిల్లా లోని ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కేంద్రాలలో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో సామాన్య ప్రజల వద్ద అధిక మొత్తాలు వసూలు చేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

క్షయ నిర్మూలనకు సమన్వయంతో కదలండి..

చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తప్పని సరిగా టీకాలు అందించాలని, ప్రజలకు జన ఔషధి మందులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని సమర్థవంతంగా నియంత్రించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో

లోపించిన పారదర్శకత

బీజేపీ రాష్ట్ర నేత రావుల రాంనాథ్



కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 29) : రాష్ట్రం ఎల్ నినో కారణంగా కరవు పరిస్థితుల్లో ఉంటే కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరవు ప్రాంతాలుగా ప్రకటించారని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ విమర్శించారు. ఇందులో పారదర్శకత కొరవడిందని ఆయన ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వల్ల రానున్న ఎనిమిది నెలలు తీవ్ర నీటి ఎద్దడి కరెంటు సమస్య ఉంటుందని , రెండవ పంట వేయవద్దని, నీటిని, కరెంటును ఆదా చేయాలని చెప్పిన ముఖ్యమంత్రి కేవలం 365 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. నిర్మల్ జిల్లాలో కూడా కేవలం 8 మండలాలలోనే కరువు ఉన్నదని, మిగతా మండలాల్లో కరువు లేదని ప్రభుత్వం దేని ఆధారంగా చెబుతుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన ప్రజలను రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రావాల్సిన కరువు నిధులను విడుదల చేయాలని, ఎకరాకు రూ.15 వేలు పరిహారం ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేశారు. ఒక పక్క కరవు విలయతాండవం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిరసనలకు వెళ్ళటానికి రైలు ఇవ్వడం లేదని ధర్నాలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించండి
- సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల (అక్టోబర్ 29) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణం తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పురోగతిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 6,465 ఇళ్లకు ముగ్గు పోశారని, 5,479 ఇళ్లు బేస్‌మెంట్ దశలో, 4,858 ఇళ్లు గోడల స్థాయిలో, 4,585 ఇళ్లు స్లాబ్ లెవెల్‌లో ఉండగా, 3,934 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు.

ఆర్థిక సహాయం

సద్వినియోగం చేసుకునేలా చూడండి..

ముగ్గు పోసిన వారితో వెంటనే పనులు ప్రారంభించాలని, దశలవారీగా బేస్‌మెంట్, గోడలు, స్లాబ్ పూర్తయ్యేలా చూస్తూ తుది దశ పనులు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. రెండో విడత కింద మంజూరైన ఇళ్ల పురోగతిపై ఆరా తీసిన కలెక్టర్, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, హౌసింగ్ ఏఈలు ఇళ్ల ప్రగతి ఫొటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు.

సమన్వయంతో

పనిచేసి లక్ష్యాలను సాధించాలి..

మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉత్తమ పనితీరు కనబరిచిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు ఆసరా

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందు కెళ్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ స్పష్టం చేశారు. చెన్నారావుపేట మండల పరిధిలోని గొల్లభామ తండా గ్రామపంచాయతీ అడ్డబాట తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారు బోడ కమలమ్మ బాలు కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని, పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్, సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, గొల్లభామ తండా సర్పంచ్ బాలు నాయక్, అమీన్‌బాద్ సర్పంచ్ దార రంజిత్, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, ఉప సర్పంచ్ బోడ చందా, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ బాలు, ఉపాధ్యక్షుడు బానోత్ ఈర్య, హచ్చా కొర్ర బీము, దామోదర్, బోడ బాలు, కుమారస్వామి, భద్రు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ లో పాపయ్యపేట విద్యార్థుల ప్రతిభ

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పాఠశాల హెచ్ఎం ప్రభాకర్‌రావు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : వరంగల్ నగరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ (SGFI) స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో చెన్నారావుపేట మండలం పాపయ్యపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. వివిధ క్రీడా విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాలతో రాణించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బి. ప్రభాకర్ రావు, కృష్ణమూర్తి, వెంకటరమణ, హరి, బండారి బిక్షపతి, శ్రీనివాస్, తస్లిమ్, మధు బాబు, పీఈటీ నరసింహారాములు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని, పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆర్టీఐ దరఖాస్తులు శాఖలకు బదిలీ

గడువులోగా పూర్తి సమాచారమివ్వాలి

కాట కుమారస్వామి

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : సమాచార హక్కు చట్టం-2005 కింద సమర్పించిన దరఖాస్తులపై తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సానుకూలంగా స్పందించిందని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి తెలిపారు. తాను సమర్పించిన దరఖాస్తులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించేందుకు ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖలకు బదిలీ చేసినట్లు ప్రభుత్వం మెమో జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ మెమో నంబర్ PR&RD RD.2/180/2026, తేదీ 17102026 ప్రకారం సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6(3) కింద ఈ దరఖాస్తులను హైదరాబాద్‌లోని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కార్యాలయంతో పాటు స్త్రీనిధి నిర్వహణ సంచాలకుల కార్యాలయానికి పంపించినట్లు వెల్లడించారు. సంబంధిత అంశాలపై అవసరమైన సమాచారాన్ని దరఖాస్తుదారునికి నేరుగా నిర్ణీత గడువులో అందించాలని శాఖ సూచించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, మహిళా సంఘాల రుణాలు, ప్రజాధనం వినియోగంపై ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని, ఆర్టీఐ ద్వారా పాలనలో పారదర్శకత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బదిలీ చేసిన దరఖాస్తులపై అధికారులు చట్టప్రకారం స్పందించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 30.10.2026
4
www.kalamjyothi.com





పార్టీ కోసం కష్టపడితే గుర్తింపేదీ?

- ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసమే శ్రమిస్తున్నాం
- రైతుల పక్షాన పోరాడితే కేసులు పెట్టారు
- దేవస్థానం కమిటీలోనైనా అవకాశమివ్వాలి
- కాంగ్రెస్ దివ్యాంగ కార్యకర్త రాజశేఖర్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 29) : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న తమ కుటుంబానికి తగిన గుర్తింపు దక్కడం లేదని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగ కాంగ్రెస్ కార్యకర్త మేడిశెట్టి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల చేపట్టిన బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకాల్లో కనీసం డైరెక్టర్ పదవి కూడా ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన తండ్రి మేడిశెట్టి దేవచంద్రం 2010 నుంచి 2020 వరకు వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా పనిచేసి గ్రామస్థాయిలో పార్టీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ శారీరక వైకల్యం ఉన్నప్పటికీ తాను పార్టీ సిద్ధాంతాలు, నాయకుల కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నానని వివరించారు. వెంకటాపూర్ గ్రామానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో వాటర్ ప్లాంట్, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఐకేపీ గోదాం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు తమ వంతు కృషి చేశామని, ఈ సేవలను పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



రైతుల పక్షాన పోరాడితే కేసులు పెట్టారు..

గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తన తండ్రి పని చేసిన సమయంలో రైతుల కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించినందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమపై కక్షపూరితంగా కేసులు పెట్టారని రాజశేఖర్ తెలిపారు. ఆ కేసుల కారణంగా ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పటికీ పార్టీ జెండాను వీడలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగట్టడంతో పాటు, సిరిసిల్ల జిల్లా ఏర్పాటు ఉద్యమంలోనూ తన వంతు పాత్ర పోషించానని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేస్తూ నిరంతరం కష్టపడుతున్న కార్యకర్తలకు పదవుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వకపోతే తీవ్ర నిరాశ ఎదురవుతుందని, స్థానిక కాంగ్రెస్ నాయకులు తన పరిస్థితిని అర్థం చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

దేవస్థానం కమిటీలోనైనా అవకాశమివ్వాలి..

మార్కెట్ కమిటీలో అవకాశం కల్పించలేకపోయినా, వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలిలో డైరెక్టర్‌గా లేదా మరేదైనా నామినేటెడ్ పదవి ఇచ్చి దివ్యాంగుడినైన తనను ఆదుకోవాలని రాజశేఖర్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రాజేందర్, సీనియర్ నాయకులు దొమ్మాటి నరసయ్య, సద్ది లక్ష్మారెడ్డి, గౌస్ తన అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించాలని విన్నవించారు. కష్టపడి పనిచేసే నిజమైన కార్యకర్తలను విస్మరించకుండా తగిన బాధ్యత అప్పగిస్తే మరింత ఉత్సాహంతో ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు.



పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 29) : పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం నుంచి మంజూరైన షూస్‌ను విద్యార్థులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.



పేదల కళ్లలో వెలుగు నింపుతాం

జనతా ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 29) : సేవాదృక్పథంతో నిరంతరం ప్రజలకు అండగా నిలవడమే జనతా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట పట్టణంలో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను గుర్తించి, వారి కళ్లలో వెలుగులు నింపాలనే సంకల్పంతోనే ఈ ఉచిత కంటి అద్దాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.

ఉచిత కంటి అద్దాల పంపిణీ..

కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది పుట్టపాక రవి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సుజిత్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా కంటి అద్దాలను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి అద్దాలు కొనుగోలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో జనతా ట్రస్ట్ ముందుకు వచ్చి ఆదుకోవడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల (అక్టోబర్ 29) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. చందుర్తి మండలం మూడపెల్లిలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయ పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గరిమ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనిచేస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నాణ్యతతో పనులు పూర్తి చేసి, భవనాలను త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కేవీస్వీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





పీఎం రహత్ పథకాన్ని ఉపయోగించుకోవాలి

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 29) : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ (PM RAHAT) పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. జిల్లా పరిధిలోని మొత్తం 7 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా బాధితులకు రూ. 1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందేలా ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి..

సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను సమర్థవంతంగా నివారించవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకొచ్చి ఆదుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
శుక్రవారం 30.10.2026
www.kalamjyothi.com



రాష్ట్రంలో ట్యాంకర్ల ఎత్తిపోతల పాలన

మొదటి పేజీ తరువాయి

ఉన్న రైతుబంధు నిధులను విడుదల చేసి, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ..

సాగునీరు అందక, కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఎలాంటి డీపీఆర్, ప్రజామోదం లేకుండా రూ.1,50,000 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. తాగునీటి ఎద్దడి, తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో మూసీ బ్యూటిఫికేషన్ టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ ప్రజాభిప్రాయ సేకరణలో బాధితులు, ప్రజాప్రతినిధులను మాట్లాడనివ్వకుండా అణచివేశారని దుయ్యబట్టారు. మూసీ బాధితుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. వెంటనే ఆ ప్రాజెక్టును నిలిపివేసి, ఆ నిధులను కరువు నివారణకు, ప్రజల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల అంశంపై కాలయాపన చేస్తూ సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారని ఆక్షేపించారు.

పరిశ్రమలకు పవర్ హాలిడేల దెబ్బ..

కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంట్ ఉండదనే మాట నిజమవుతోందని, రాష్ట్రంలో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించడం వల్ల పారిశ్రామిక రంగం తీవ్రంగా నష్టపోతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ లేక పరిశ్రమలు మూతపడే దశకు చేరుకున్నాయని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ పాలనా వైఫల్యమేనని విమర్శించారు. రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు విద్యుత్ ఇవ్వలేని ప్రభుత్వం ప్రచారాలకు మాత్రం ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని రాహుల్‌గాంధీకి ఏటీఎంగా మార్చేశారని, ఇంత విధ్వంసం జరుగుతున్నా కాంగ్రెస్ అగ్రనాయకత్వం నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ ఒక గోబెల్స్ సమ్మిట్ అని, గత సమ్మిట్ వల్ల ఒక్క పెట్టుబడి, ఒక్క ఉద్యోగం రాలేదని ఆరోపించారు. గతంలో 9,46,000గా ఉన్న ఐటీ ఉద్యోగాలు కాంగ్రెస్ రాకతో 7,000 మేర తగ్గాయని స్వయంగా ప్రభుత్వమే అంగీకరించిందని తెలిపారు. పవర్ హాలిడేలు ఉన్న రాష్ట్రంలో ఎవరు పెట్టుబడులు పెడతారని ప్రశ్నించిన ఆయన, మూడేళ్లలో జరిగిన విదేశీ పర్యటనలు, ఎంఓయూలు, వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.







మీ పెట్టుబడులకు బాధ్యత నాది

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 30) : తెలంగాణలో పెట్టుబడిదారుల ప్రతి పైసాకు భద్రత కల్పించడం, ఆ పెట్టుబడులు వృద్ధి చెందేలా చూడడం తన వ్యక్తిగత బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు సీఎం హృదయపూర్వక స్వాగతం పలికారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకాటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలు, అధికారులను సాదరంగా ఆహ్వానించారు. సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా వెలుగులీనిందని, చార్మినార్ కేంద్రంగా అంతర్జాతీయ వ్యాపారాలు సాగాయని గుర్తుచేశారు. నిజాం పాలకులు అద్భుత కట్టడాలు, మ్యూజియం, టంకశాల, విమానాశ్రయం, రైల్వేలతో నగరాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ప్రేమ్ వత్స వంటి మేధో నిపుణులను అందించిందని వివరించారు.

పెట్టుబడులను రెట్టింపు చేసుకోండి..

కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, దేశ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ సంస్కరణలు తెచ్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలను సీఎం స్మరించుకున్నారు. హైదరాబాద్ జీవనంలోనే ప్రపంచస్థాయి దృక్పథం, సంస్కరణలను స్వీకరించే తత్వం దాగున్నాయన్నారు. 1991 నుంచి వివిధ ప్రభుత్వాలు మారినప్పటికీ హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అంతా మద్దతుగా నిలిచారన్నారు. పెట్టుబడిదారులు తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ఆ మొత్తాన్ని, ఆశిస్తున్న వృద్ధిని, లాభాలను రెట్టింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. విధాన పరమైన నిర్ణయాలైనా, ప్రభుత్వ సహకారమైనా అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటానారు.

తెలంగాణతోనే వికసిత భారత్..

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం వికసిత్ భారత్ 2047 ధ్యేయానికి అనుగుణంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని వివరించారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తేల్చిచెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని, అభివృద్ధి విషయంలో ఇరు ప్రభుత్వాలు సమన్వయంతో సాగుతున్నాయని తెలిపారు.

ప్రపంచ నగరాలతోనే హైదరాబాద్ పోటీ..

దేశంలో ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు హైదరాబాద్ తో అనుసంధానం కానున్నాయని, హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణె మార్గాల్లో ఇవి ఏర్పాటుకానున్నాయని సీఎం తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్ లలో కొత్త విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, నేవీ రాడార్ కేంద్రానికి కేంద్ర సహకారం అందుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశీయ నగరాలైన ఢిల్లీ, ముంబయి, బెంగళూరులతో కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతోనే పోటీ పడుతుందన్నారు. పారిశ్రామికవేత్తల విజయపథంలో ఉన్న అడ్డంకులను తొలగించడమే ప్రభుత్వ బాధ్యతని, పరిశ్రమ వర్గాలు ఇచ్చే అత్యుత్తమ ఆలోచనలను విధానాలుగా అమలు చేస్తామని, ఈ ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



ప్రధాని మోదీకి మీడియా ఫోబియా

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 30) : బీజేపీకి బలమైన పట్టున్నప్రాంతాల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విజయాలు సాధించి ఆ పార్టీకి గట్టి రాజకీయ సందేశాన్ని ఇచ్చాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి బీజేపీకి సవాల్ విసిరిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసితో పాటు పాట్నా, పుణె, గోరఖ్‌పూర్‌లలో బీజేపీ అభ్యర్థుల ఓటమి ఆ పార్టీ పాలనపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తికి నిదర్శనమని అన్నారు. నాగ్‌పూర్ నుంచి వారణాసి వరకు ఎదురవుతున్న రాజకీయ పరాజయాలపై ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీకి మీడియాను ఎదుర్కొనే ధైర్యం లేక మీడియా ఫోబియాతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఐక్యంగా పోరాడుతున్నాయని, భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రైళ్లు నిరాకరించడం వెనుక కేంద్రం కుట్ర..

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీకి కాంగ్రెస్ కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్లను నిరాకరించడం వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి కార్యాలయాల ఒత్తిడి మేరకే రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ శ్రేణులను ఢిల్లీకి తరలించి తీరుతామని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో ప్రభావంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, గతంలో కేసీఆర్ కరోనాను తేలికగా తీసుకున్నట్లే ఇప్పుడు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలే కారణమని ఆయన పేర్కొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

ఆ తప్పిదంలో సగం బాధ్యత నాదే..

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన పెద్ది సినిమాలో తన పాత్రను మితిమీరిన గ్లామర్ కోణంలో చూపించడంపై నటి జాన్వీ కపూర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాఫీ విత్ కరణ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఆ తప్పులో సగం బాధ్యత తనదేనని, షూటింగ్ సమయంలోనే తాను వ్యతిరేకించి ఉండాల్సిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. దక్షిణాది చిత్రాలలో సన్నివేశాలు, కామెరా యాంగిల్స్ ముందే స్పష్టంగా చెప్పరని, తన పలుకుబడిని ఉపయోగించి ముందే స్క్రిప్ట్ తెలుసుకోలేకపోయానని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండి జాగ్రత్తపడతానని ఆమె స్పష్టం చేశారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.